క్లుప్తంగా

గంగూరులో సామూహిక సీమంతాలు



పెనమలూరు: గంగూరు అంగన్‌వాడీ కేంద్రం – 4లో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ కె.బేబీసుకన్య మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడంతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిరు ధాన్యాలు, ఆకు కూరలు ఎక్కువగా తినాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే కిట్స్ గర్భిణులు, బాలింతలు తినాలన్నారు. దీని వలన పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలని ఆ పాలల్లో అనేక పోషకాలు ఉంటాయన్నారు. సీమంతాల సందర్భంగా గర్భిణులకు చీర, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.శ్రీలత, పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఎంఎస్‌కె టి.లిఖిత, ఎం.జ్యోతి, ఎంసీహెచ్‌పీ విజయరాణి, ఏఎన్‌ఎం మార్తమ్మ, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వంట నూనె విక్రయాలు



కంకిపాడు: పేద, మధ్యతరగతి వర్గాలపై భారం పడకుండా సబ్సిడీపై వంట నూనెల విక్రయాలకు ప్రభుత్వం ఆదేశించిందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో కంకిపాడు రైతుబజారు ప్రాంగణంలో సబ్సిడీపై వంట నూనెల విక్రయాలను బుధవారం ప్రారంభించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సబ్సిడీపై పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ అందుబాటులో ఉంచారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావన్నారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర, నాయకులు పులి శ్రీనివాసరావు, బొర్రా వెంకట్, ఈఓ చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

కంకిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. మండల స్థాయి సామాజిక తనిఖీ గురువారం ఏర్పాటు చేశామని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



కంకిపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని నగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో నక్కా శ్రీనివాసరావు నివాసంలో ఏర్పాటుచేసిన దుర్గామండపంలో మూలా నక్షత్రం సందర్భంగా విద్యార్థులకు బుధవారం నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో రాణించాలన్నారు.

పశు సంరక్షణతో ఆర్థికాభివృద్ధి



కంకిపాడు: పశు సంరక్షణతో ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్(బుడ్డి) అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో తన సొంత ఖర్చులతో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని చంద్రశేఖర్ ప్రారంభించి పశు పోషకులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్‌వీఎస్ రంగారావు, రవికుమార్, మాధవరావు, జేవీఓలు శ్రీనివాసరావు, కొండలరావు, నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు సాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తూ, ఇటీవల వచ్చిన బుడమేరు వరదలో నష్టపోయిన చిరుద్యోగులకు ఆ శాఖ హెచ్‌ఓడీ కార్యాలయ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యాలయంలో 17 మంది పనిచేస్తుండగా, ఒక్కొక్కరికీ రూ.10 వేలను ఇంజినీర్ ఇన్ చీఫ్ కె.నయీముల్లా, చీఫ్ ఇంజినీర్లు వి.రామచంద్ర, ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎన్.మాధవిసుకన్య చేతుల మీదుగా బాధితులకు ఆర్థిక సాయం అందించారు.

విద్యా ప్రదాయిని..

నమస్తుభ్యం



సరస్వతీదేవిగా మంగళగౌరీదేవి



పేరంటాలమ్మ ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



యనమలకుదురులో కాళరాత్రిదేవిగా అమ్మవారు



సరస్వతీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు



సరస్వతీదేవి అలంకరణలో జగదాంబ దేవి

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో బుధవారం అమ్మవార్లు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు, హోమాలతో పాటు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. – సాక్షి నెట్‌వర్క్



అల్లాపురంలో అన్నసమారాధన చేస్తున్న ఎంపీపీ రవి



ఉషారామంలో పూజ చేస్తున్న రాంబ్రహ్మం, ఉషా దంపతులు



సున్నలో పూజ చేస్తున్న ఎంపీటీసీ సరోజిని దంపతులు



కంకిపాడులో సరస్వతీదేవిగా వాసవీ మాతా



కంకిపాడు శివాలయంలో సరస్వతీ దేవి



సరస్వతీదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి



గాయత్రీనివాస్‌లో సరస్వతీదేవి

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



పోరంకిలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెనమలూరు: రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని కృష్ణా జిల్లా డీఆర్‌సీ అధికారి పద్మజ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పోరంకి, కానూరు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ.. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడరాదన్నారు. పంటకు సుడిదోమ ఆశించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి 1262 రకానికి నల్లులు ఆశిస్తున్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, ఏఈవోలు స్మైలీ, సుష్మా, రైతులు పాల్గొన్నారు.

గొల్లపూడిలో కాల్వ గండ్లు పూడ్చాలి..

అంబాపురం(విజయవాడరూరల్): గొల్లపూడి కాల్వకు పడిన గండ్లు పూడ్చి, దాళ్వాకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అంబాపురం గ్రామ రైతులు కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇటీవల వచ్చిన వరదలకు పంట పొలాలు దెబ్బతిని, నష్టపోయామని రైతులు చెప్పారు. ప్రభుత్వం నుంచి అరకొరగా నష్టపరిహారం అందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లపూడి పంపింగ్ స్కీమ్ వద్ద పంపులు వరదల్లో ముంపునకు గురైన సాగునీరు విడుదల అయ్యే అవకాశం లేదన్నారు. మరో రెండు నెలల్లో దాళ్వా సాగు చేసేందుకు అవసరమైన నీటిని సరఫరా చేయాలని, అంతకంటే ముందుగా కాల్వకు పండిన గండ్లు పూడ్చాలని కోరారు. సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఏఓ రంగనాథ్‌బాబు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి



కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉయ్యూరు: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.రాజేష్ కోరారు. ఉయ్యూరు పట్టణంలోని సమస్యలు, టిడ్కో గృహాల లబ్ధిదారుల రుణాల విషయమై కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాజేష్ మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ, వీధి దీపాల సమస్యలు, దోమల బెడద అధికంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. టిడ్కో గృహాలు మంజూరు చేయకుండానే రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు వేధిస్తున్నారన్నారు. బ్యాంకర్ల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడ్కో గృహాలు కేటాయించే వరకూ రుణాలు చెల్లించాల్సిన అవసరం లేదని, బ్యాంకర్లతో మాట్లాడతామన్నారు.

'ఎమ్మెల్యే యార్లగడ్డకు తెలిసే నాపై దాడి జరిగింది'

గన్నవరం: టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తున్నానని.. మద్యం దుకాణానికి దరఖాస్తు చేసేందుకు వెళ్తే సొంత పార్టీ నేతలతోనే కొట్టించారని టీడీపీ నాయకుల చేతిలో గాయపడిన ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కంచర్ల ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తనపై దాడి విషయాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు చెబితే తనకు చెప్పకుండా దరఖాస్తులు ఎందుకు చేశావని ప్రశ్నించారన్నారు. తనపై జరిగిన దాడి కూడా ఎమ్మెల్యేకు తెలిసే జరిగిందని భావిస్తున్నానని ఈశ్వరరావు చెప్పారు. గత ఎన్నికల్లో యార్లగడ్డ వెంకట్రావు విజయం కోసం ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించినందుకు తగిన శాస్తి జరిగిందని వాపోయారు. అయ్యప్ప మాల ధరించిన తెలుగు యువత నాయకుడు పరుచూరి నరేష్ తనను అడ్డుకుని కొట్టి, డీడీ పత్రాలు, దరఖాస్తులను చించివేసే ప్రయత్నం చేశారన్నారు. దాడి విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

సమన్వయంతో పని చేస్తే గ్రామాల అభివృద్ధి



శిక్షణా తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: సమన్వయంతో పని చేస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పరిపాలనపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏర్పాటుచేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శిక్షణ తరగతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమష్టి కృషితోనే ప్రగతి జరుగుతుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామ పంచాయతీ పరిపాలనపై ప్రజాప్రతినిధులకు అవగాహన అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వి.భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలనపై అవగాహన కలిగి ఉండాలి

విజయవాడరూరల్: గ్రామ పంచాయతీ పరిపాలనపై ఉప సర్పంచ్‌లు, పాలకవర్గం సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎంవీ దుర్గాప్రసాద్ అన్నారు. కామన్ అడ్మినిస్ట్రేటివ్, తాగునీరు, శానిటేషన్, గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు తదితర అంశాలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకోవాలని, అదే విధంగా గ్రామాల్లో జరిగే గ్రామసభలకు హాజరై ఆదాయ వనరుల వివరాలు, ప్రణాళిక ఇతర అంశాలను తెలుసుకోవాలని సూచించారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి కృష్ణప్రసాద్ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

శ్మశానవాటిక స్థలాల సమస్యను పరిష్కరించాలి



తహసీల్దార్ భావన్నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నేతలు

కంకిపాడు: శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించడంతో పాటు స్థలాల సమస్యను పరిష్కరించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో దళితవాడల శ్మశానవాటిక స్థల విషయమై బుధవారం తహసీల్దార్ వి.భావన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోగులమూడి రాజు మాట్లాడుతూ.. దళితులకు శ్మశానవాటికలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శ్మశానవాటికల స్థలాల సేకరణకు అవసరమైన నిధులు కేటాయించాలని, ఆయా ప్రదేశాల్లో షెడ్లు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని, తాగునీరు, రహదారి సదుపాయాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘ నాయకులు పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం



భోజనం వడ్డిస్తున్న కీర్తి తదితరులు

పెనమలూరు: యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పేదలకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యనమలకుదురు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివశించే పేదలు, అనాథలకు మంగళవారం రాత్రి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు వీరంకి కీర్తి మాట్లాడుతూ.. 200 మందికి అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా అనాథలు అండగా నిలిచి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని కీర్తి తెలిపారు.

భవానీ భక్తులకు అన్నదాన శిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గ గుడికి కాలి నడకన వెళ్తున్న భక్తులకు బాపులపాడు మండలం బొమ్ములూరులో పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరం బుధవారం కూడా కొనసాగింది. ఈ శిబిరంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. విజయవాడ దుర్గ గుడికి కాలినడకన వెళ్తున్న భవానీ భక్తులకు ప్రత్యేకంగా విశ్రాంతి శిబిరం, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి గత 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా భవానీ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు దాత పుట్టగుంట చెప్పారు. ఈ సందర్భంగా పుట్టగుంటను పలువురు అభినందించారు.

దళారులకు అడ్డాగా రైతుబజార్

- టీడీపీకి చెందిన వారికే షాపులు
- ప్రైవేట్ కూరగాయల వ్యాపారుల తిష్ట
- అధికారుల ప్రమేయం లేకుండా షాపుల కేటాయింపు





కానూరులో కాలువ కట్టపై ఏర్పాటు చేసిన రైతు బజార్ (ఇన్‌సెట్) బందరు రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

పెనమలూరు: రైతుబజార్ ముసుగులో టీడీపీ నాయకులు దందాకు తెరలేపారు. కానూరులో బుధవారం రైతుబజార్‌ను ప్రారంభించగా రైతుబజార్‌లో దళారులు దర్శనమిచ్చారు. దీంతో సామాన్య ప్రజల కోసం ఏర్పాటు చేయాల్సిన రైతు బజార్‌ను ఆదిలోనే భ్రష్టు పట్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో ఎక్కడా రైతుబజార్ లేదు. దీంతో తక్కువ ధరలకు కూరగాయలు కొనటానికి సామాన్య ప్రజలు పటమట లేదా కంకిపాడుకు వెళ్లాల్సిన పరిస్థితి. కరోనా సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీలో తాత్కాలిక రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారిన తరువాత రైతుబజార్ మాయమైంది.

కాలువ కట్టపై వెలిసిన రైతుబజార్

సిద్దార్థ కాలేజీ బయట ఫుట్‌పాత్‌పై కూరగాయలు విక్రయిస్తుండడంతో రైతుబజార్ ఏర్పాటు చేస్తామని టీడీపీ నేతలు ప్రకటించారు. దీంతో కేసీపీ కాలనీ ఎదురుగా కాలువ కట్టపై రైతు బజార్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. ఇక్కడ వరకు వ్యవహారం బాగానే ఉన్నా రైతుబజార్‌లో దళారులు ప్రత్యక్షమయ్యారు. దీంతో రైతుబజార్ ముసుగులో దళారులు దందా చేయటానికి తెరలేపారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలేజీ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న వారికి మాత్రం రైతుబజార్‌లో షాపులు కేటాయించలేదు.

షాపులు కేటాయించింది ఎవరు..?

కొత్తగా ఏర్పాటు చేసిన రైతుబజార్‌లో షాపులు ఎవరు కేటాయించారనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. నిబంధనల ప్రకారం రైతుబజార్‌లో రైతులు, దివ్యాంగులు, డ్వాక్రా సంఘాలకు, సొసైటీలకు చెందిన వారికి షాపులు కేటాయించాలి. మార్కెటింగ్ శాఖ ఈ కేటాయింపులు పరిశీలించి చేస్తుంది. అయితే ఇక్కడ మాత్రం టీడీపీ నాయకుడు కార్యాలయం నుంచి షాపులు కేటాయించారని ఆరోపణలు వినబడుతున్నాయి. షాపుల కేటాయింపులో పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారిందని ఆరోపణలు వస్తున్నాయి. పైగా పోరంకిలో కూరగాయల షాపులు పెట్టి వ్యాపారం చేస్తున్న వ్యాపారులే రైతుబజార్‌లో తిష్టవేసి ఆధిపత్యం చూపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లో రైతుబజార్ ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. రైతుబజార్ ప్రారంభమైన మొదటిరోజే లుకలుకలు బయటపడ్డాయి. పైగా రైతుబజార్ పరిపాలన ఎవరూ నిర్వహిస్తారన్న ప్రశ్నకు మార్కెటింగ్ శాఖ, తాడిగడప మున్సిపాలిటీ అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పటం లేదు.

ట్రాఫిక్‌కు అంతరాయం

రైతుబజార్ విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు పక్కనే అత్యధిక ట్రాఫిక్ ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేశారు. రైతుబజార్‌కు వచ్చే వారు వాహనాలు బందరు రోడ్డుపై పార్కు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోవటం లేదు. ఇక్కడ ప్రమాదాలు జరిగితే పాలకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ

పెనమలూరు: త్వరలో జరగనున్న కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయటానికి అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్, సహా ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ.. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పదవి కాలం వచ్చే ఏడాది మార్చి 29వ తేదీన ముగుస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా స్థానంలో కొత్త ఓటర్ల జాబితా రూపొందిస్తామని చెప్పారు. ఓటరల జాబితా తయారు చేయటానికి ఈ ఏడాది నవంబర్ 1వ తేదీన అర్హతగా నిర్ణయించారన్నారు. ఓటర్ల జాబితాలో చేరేవారు భారత పౌరులై, 1.11.2021 నాటికి పట్టభద్రులై ఉండాలని తెలిపారు. పై అర్హత కలిగిన వారు ఓటు హక్కు కోసం ఫారం 18ని నింపి ,డిగ్రీ సర్టిఫికెట్‌ను గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేసి ఫొటో జతపరిచి తమ కార్యాలయంలో అందచేయాలని లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

కానూరులో రైతుబజార్ ప్రారంభం

పెనమలూరు: కానూరు కేసీపీ కాలనీ ఎదురుగా ఇరిగేషన్ కాలువ కట్టపై రైతు బజార్‌ను బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. రైతుబజార్లలతో ప్రజలకు తక్కువ ధరలకే కూరగాయలు అందిస్తున్నామన్నారు. పెనమలూరు ప్రాంతంలో రైతుబజార్ లేక పోవటంతో కానూరులో కొత్తగా రైతు బజార్ ప్రారంభించామని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తితే రైతు బజార్ మనుగడ ఉండదన్నారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ భవాని ప్రసాద్, టీడీపీ నేతలు వెలగపూడి శంకర్‌బాబు, అనుమోలు ప్రభాకరరావు, నర్రా చంటి, దోనేపూడి రవి, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు

పెనమలూరు: పెనమలూరు మండలంలో ఆరు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు కొత్తగా కార్యదర్శులు బదిలీపై వచ్చారు. వణుకూరు గ్రామ పంచాయతీ ఈఓగా వి.పద్మావతిదేవి, చోడవరం ఈఓ బి.సునీత, గంగూరు ఈఓ బి.వెంకటేశ్వరరావు, గోసాల ఈఓ కె.కూర్మారావు, పెదపులిపాక ఈఓ వెంకటరత్నం, పెనమలూరు ఈఓ సయ్యద్ కరీం అహ్మద్ బాధ్యతలు చేపట్టారు.